# పెపేష్జీ పెత్తాలు

## "పిసిమూరి"

కాల జగన్నాథుని రథచక్రాలు దొర్లుతున్నాయి. గూడెంలో కోళ్ళ గుంపుల అరపు లెక్కువయ్యాయి. అర్ధాకలితో లోతుకు పీక్కుపోయిన డొక్కలు, వాడిపోయిన ముఖాలు, సంస్కారంలేని చింపిరి జుట్టు, శుష్కించిన దేహాలతో శ్రామికులు తమ, దైనందిన జీవితకార్యకలాపాల నిర్వహణకు తయారౌతున్నారు.

రత్తి మట్టికడవ బుజాన పెట్టుకొని గుంట దగ్గరకు వెళ్ళింది. నీళ్ళు క్రితం రోజుకన్నా మరీ లోతుకుపోయి పసరుతో కూడుకున్నై. ఈ నీళ్ళతో కాలం గడపటం ఎలాగను కుంది? కానీ తప్పేదేముంది? పంపులూ, కుళాయీలు లేకపోతే మానె, ఒక బావి అన్నా త్రవ్వి పెట్టగూడదు? ఎవరు త్రవ్వి పెడతారు? తాము త్రవ్వకుంటా మంటె నే పంచాయతీవారు, వొప్పుకోవటం లేదు. కారణం ప్రెసిడెంటు పార్టీ వాళ్లకు ఎన్నికల్లో గూడెంవాళ్ళు ఓట్లుయిచ్చి సహాయం చెయ్యలేదు. దేశం మనదే. పాలించేవాళ్ళు మనవాళ్లే. పండించేదిమనమే. తినటానికీ, కట్టుకోవడానికీ, త్రాగటానికీ మాత్రం లేవు. రోజు గడవని తమ దుస్థితిని తలపోసుకొంటూ రత్తి గుడిసె జేరి, ఓటిబానపైన చిరుగుల, పైట చెంగును వేసి నీరు ఒడపోస్తూ ఉంది. పోలిగాడు "సాలాపొద్దెక్కిందే" అంటూ కళ్లు నలుపుకొంటూ బయటికి వచ్చాడు. "గంజికి నూకల్లేవు. పెద్దదొరగోర్ని అడిగి కూలిగింజలు తేవాల్నయ్యోయ్!" అంది రత్తిభర్తముఖంలోకి చుస్తూను.

"అట్టాగేలే!" అని పోలిగాడు బయలుదేరి దొరయింటికి వెళ్లాడు. దొర ఇంట్లో లేడు. దొరగారి యిల్లంతా సందడిగా ఉంది. ఇంటి ముందు పందిరి వేసి, రంగు జండాలు కడుతున్నారు. ఈ హంగామా అంతా చూచి "ఏమిట్రా? నరిసిగా! యీ యాల దొరగారి యింట్లో యిసేసం!" అన్నాడు పోలిగాడు.

"ఇయ్యాల మాయింటి కాడ పెద్దయిందు. మంతిరిగోరు వత్తుండారు. బజాట్లో బాయి కాడ గాంధీగోరి బొమ్మ నేయిత్తుండ్రా మన దొర. తెల్దంట్రా? ఎదవనాయాల." అన్నాడు కమతగాడు నరిసిగాడు.

ఇంతలో వెనకనుంచీ దొర వచ్చి పోలిగాడి చెయ్యిపట్టుకొని "పోలాయ్! ఇవ్వాళ మన యింట్లో విందు. గాంధీగారి విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రిగా రొస్తున్నారు. నువ్విక్కడే ఉండు. భోంచేసి పోదువుగాని." అన్నాడు. దొరగారి హరిజన వాత్సల్యానికి, ఆయన ప్రక్కన ఉన్న మిత్రులిద్దరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు.

చూడక చెంగో, చెయ్యో! తగిలితే "అంత కళ్లు నెత్తికెక్కినైయట్రా, అదిరిపాటు లమ్మికాడకాకి?" అని తన్నటానికి సిద్ధమయ్యే దొర ఇవ్వాళ తనంతట తాను వచ్చి దగ్గర బంధువుని ఆదరించినట్లుగా నటించడం పోలిగాడికి ఆశ్చర్యం కలిగించింది. దొరకు మతిపోయిందా అన్నట్లు వెర్రిగా చూశాడు. ఖద్దరులాల్చీ, ముతక ఉత్తరీయం, ధోవతీ, తలపైన గెల్లటోపీ, టోపీపైన మూడురంగుల బ్యాడ్జీ...దొరగారి యీ వేషం చూచేటప్పటికి పోలిగాడి కళ్ళు బయర్లు కమ్మినై. క్రితం ఎప్పూ అల్లాంటి వేషంలో ఉండగా పోలిగాడు తన దొరని చూచి ఎరుగడు.

కొంతసేపటికి పోలిగాడు తమాయించుకొని "బాబుగారు! యియ్యాల అచ్చంగ గాంధీగోరికి మల్లే, దేశనాయకుల ల్లేనే ఉండారు" అన్నాడు.

"ఓరి! వెధవ... ఒకప్పుడు మాత్రం మన చెయ్యి ఎందులోరా తక్కువ?" అన్నాడు దొర.

"చిత్తం! బాబూ! చిత్తం." అన్నాడు. ఖంగారు పడుతూ పోలిగాడు ఏదో తన తప్పిదాన్ని సవరించుకొంటున్నట్లుగా.

"ఇక్కడ మీకేమీ పనిలేదు. రండిరా! పోదాం. బావిదగ్గర పందిరి వేసి, బల్లలు సర్దాలి." అని దొర నరిసిగాణ్ణి, పోలిగాణ్ణి వెంట బెట్టుకు, మిత్రులతో వెళ్లాడు.

* * *

ఆ రోజు ప్రొద్దుగ్రుంకేవరకూ పోలిగాడు గుడిసెకు చేరలేదు. రత్తికి, విసుగూ కోపం వచ్చి "ఎవరో పెద్ద, పెద్దోళ్లు వత్తే యీ సచ్చినోడి కెందుకంట? దొరని కూలడుక్కు, సక్కారాక. ఆళ్లుండోళ్ళు గనుక సంబరాలు సేసుకుంటారు. కూలి కెగ్గొట్టి సంబరాలు సూడపోతే, రేపు గతేం అవుతది," అని తనలోతాను గొణుక్కొంటూ ఉంది.

ఇంతలో లల్లాయిపదాలు పాడుకొంటూ యీల వేసుకొంటూ పోలిగాడు వచ్చి "ఏమేవ్! అప్పుడే తొంగున్నారంటే, అబ్బబ్బ! బలే! బలే!

"ఏంట్రా? నీ జిమ్మదియ్యా! తాగొచ్చావా?"

"ఛా...ఛా...ఇయ్యాలనుంచీ, తాగటవే! చపదం తీసుకుంటె గాంధీగోరి బొమ్మ దగ్గర. తాగొచ్చావంటావ్! నీ సిగదరగ."

"కొప్పెగర దన్నేవోళ్లు లేక ఇంతయాల దాక యాడుండావంట? బుడ్డోళ్లిద్దరూ, ఏడి గంజికోసరం ఏడిసి, ఏడిసి నిద్దరోయారు. గింజలెయ్యి. దొర యియ్యలా!"

"దొర అనబోక... పెబువు, పెబువచ్చు యియ్యాల. ఊరంతా ఎంత పండగ సేసాడే! నా నెయ్యాట్టుకున్నాడు. మీటింగుకాడికి తీసుకుపోయాడు."

"ఆ... నిజంగానంట్రా?"

"మరేమనుకొన్నావ్! పోలిగాడి దెబ్బంటే!......ఆళ్లు మనం అంతా ఒకటేనంట. మీటింగుకాడ సెప్పలా!"

"అరి...సచ్చినోడ...దొర నీ సెయ్యి చ్చుకుంటే, నీకు సిగ్గటాలేకపోయింద్రా!

"సిగ్గెందుకే! పాడుమొగందాన. మంతిరిగోరి మెళ్లో దండకూడ ఏయిత్తే, దొర!"

"ఆ...ఆ... నీచాతే నంట్రా! బయ

గనోక్వెల్
అన్నిసెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశి, రాజమండ్రి.

చెయ్ లేదంట్రా? కొల్లొణకలా! అల్లు సెయ్యమన్నయ్యల్లా సేసొచ్చావ! రేపు నీ పని పడతార్లే. ఆళ్లల్లోకి నువ్వెందుకు పొయ్యావురా! పోయినోడివి దూరాన తగలడి సూసి సక్కా రాక, నీకీ తగని పనులన్నీ ఎందుకురా? అల్లు దొర్లు, మనం కూలోళ్లం... మనకీ మీటింగులు, యీ సొలు దేనికిరా...?"

"ఓసేవ్! యీసమంటే గ్యాపకం వొచ్చింది. మన దొర, సావుకారు బంగొరయ్యగోరు అంతా ముతకగుడ్డలు కట్టారు. టోపీ లెట్టారు.

"మరేందనుకున్నావ్? రా! అల్లు టోపీ లెట్టుకు నే, నీకు, నాకు టోపీ ఏత్తారు."

"అబ్బ! బలే పప్పణ్ణం. తాగినంత సెయ్యి పోశారు. పంచదార లడ్డూలు, పులోర, ఇంకేందేందో సాలరకాలు పెట్టారే. నా జనములో తిని ఎరగను."

"సిగ్గులేనోడ. ఇంటికాడ పిల్లలుంది తెలియదంట్రా. నీపొట్టపగలని..తినొచ్చా. కొస్తిని పంచచెంగున అడుక్కని మూట గట్టుకు రాకూడదూ."

"నోరుముయ్యేవ్! తప్పుగాదు. రేపుణ్ణుంచి మనవూ సాల సేసుకు తినచ్చులే. ఇహమీన నాగా లేకుండా కూలి దొరుకుతాదిలే."

"ఏం? కత?"

"ఆచుపత్రి కడతారంట.'
బళ్లు పెడతారంట. మందిత్తారంట. పతుకులు సెబుతారంట.'

"డబ్బూ, డుబ్బూ నేకుండా నేనా?"

"మరేందనుకున్నావ్? చ్వతంత్రం—చ్వతంత్రం రాలా. మనికి."

"చ్వతంత్రం వొచ్చినాక సెవిని పడేయన్నీ మంచి మాటలేరా!"

"ఆ గోసె పరవ్వే! సాల పొద్దోయింది. తొంగుందాం. నిద్ర కల్లమీనకొత్తంది.'

మర్నాటినుంచి పోలిగాడిపై, గూడెంలోవాళ్లకి ఈర్ష్య, గ్రామంలో అగ్రవర్ణాలవారికి ద్వేషం పుట్టుకొచ్చినై. పెద్దదొర అచ్చయ్యగారు వాడిచేత మినిష్టరుగారి మెళ్లో దండవేయించి వాడికేదో ఘనతను, పేరు ప్రఖ్యాతుల్ని, సంపాయించిపెట్టాడని గూడెంలోవాళ్ల కొరకొర. మిగతావాళ్ల మాదిరిగా ఎడంగా ఉండి చూసి చక్కాపోక, తమ పెద్దరికాన్ని, మోతుబరీతనాన్ని లక్ష్యంచెయ్యకుండా, బల్లెక్కి మంత్రిగారిమెళ్లో దండ వేయడం, సహపంక్తిని కూర్చొని భోంచేయడం గ్రామంలోని అగ్రజాతులవారికి తలవంపుగా కనబడి, వాడు కంట బడితే సరి, మండిపడటం సాగించారు.

ఒకాయన "ఈ లమ్డీకొడుక్కి కళ్లు నెత్తికెక్కినై." అంటే మరో ఆసామి "ఈ వెధవకి పొగరుబట్టి వొళ్లు బలిసింది. కన్నూ, మిన్నూ కానటం లేదు." అంటం సాగించారు. గూడెంలో వాళ్ల హేళనలూ, వెక్కిరింతలూ జాస్తి అయినై. పోలిగాడికుటుంబాన్ని పనిపాటల్లోకి పిలవడం మానేశారు. సంసారం గడవటం కష్టమైపోయింది.

పోలిగాడు, రత్తి తమ సంసారపుగోడు చెప్పుకోవడానికని ఒకరోజు బయలుదేరి పెద్దదొర అచ్చయ్యగారి యింటికి వెళ్లారు.

"ఆడు దొర్లమాట పెకారం ఆరోజు వడుసుకున్నాడు. అది అందర్కి కట్టంగా ఉందిగావాల. వోరూ కూలికి పిలవటమే లేదు. మీ పాదాలదగ్గర బతికేవాళ్లం. దొరా ఏంసేయమంటారు? నిన్నల్లా పసాళ్లతోసహా యింటిల్లపాది పత్తే పడుకుండాం." అంది రత్తి ఏడుస్తూ అచ్చయ్య దొరముఖంలోకి దీనంగా చూస్తూ.

"ఈ దెబ్బ, దొర్లు కాయకపోతే, మేవూ, మా పిల్లలూ, మల, మలా మాడిపోతాం. దయ చూపించాలి!' అన్నాడు పోలిగాడు దీనంగా.

"పోలిగా! మీకేం ఫర్వాలేదు. నేను ఇనుము, సిమెంటు పర్మిట్లు సంపాయించాను. ఆసుపత్రి కట్టే కంట్రాక్టుగూడ నేనే తీసుకున్నాను. మీరు ఇహ గూడెంలో ఉండద్దు. మైదానంలో పాకా వేసుకోండి. గూడెంలో నిన్ను వెక్కిరించిన వెధవలంతా పని యిప్పించమని లేపటినుంచీ నీ చుట్టూ తిరిగేటట్టు చేస్తా! చూడు ..."అన్నాడు పెద్దదొర అచ్చయ్య పౌరుషంగా.

ఆసుపత్రి నిర్మాణంకోసరం విరివిగా విరాళాలు ప్రోగుజేశారు. పలుకుబడిగలవాడు, పార్టీ పెద్ద అచ్చయ్య, ప్రభుత్వ సహాయంతో ఆసుపత్రిభవన నిర్మాణపు కంట్రాక్టు సంపాయించాడు. జీపుకారులో నుంచీ కాలు క్రింద బెట్టకుండా పనివాళ్లతో, పునాదులు, గోడలు లేపేస్తున్నాడు. ఇచ్చిన కోటాలు చాలవని, పలుకుబడి వినియోగించి కొత్త కోటాలు ఇనుమూ, సిమెంటు సంపాయించి బ్లాక్ మార్కెట్టులో అమ్ముకోవడం మొదలుపెట్టాడు. కంట్రాక్టర్ అచ్చయ్యకు పలుకుబడితోపాటు, డబ్బూ పెరుగుతోంది. మండు టెండలో చెమటోడ్చుకొంటూ, పోలిగాడు రాళ్లు మోస్తున్నాడు. మాడు మంటపుడుతున్నా, విరామ మనేది



లేకుండా, రత్తి సిమెంటు, సున్నపు బొచ్చెలు మోస్తూ ఉంది. వాళ్ల జీవితంలో మాత్రం ఎదుగూ, బొదుగూ అనేదిలేదు. వాళ్ల రెక్కలే వాళ్ల కాధారం.

తెల్లవారుతోంది, ప్రొద్దు గ్రుంకుతోంది, రోజులు గడుస్తున్నాయి.

దీర్ఘచతురస్రాకారపు పెద్దగదికి టాపీ పనివాళ్లు సిమెంటుపని చేస్తున్నారు. రత్తి బొచ్చెలు అందిస్తోంది. కంట్రాక్టర్ అచ్చయ్యగారు పని ఎంతవరకూ, పూర్తి అయ్యిందో చూద్దామని జీపుకారు దిగి, గబ, గబా గది మధ్యకొచ్చి నిలుచుని, పని చేయిస్తున్న గుమాస్తాకేసి చూస్తూ "ఇది కాన్పులగది. చుట్టూ గజమెత్తువరకూ పింగాణీ బిళ్లలు అతకాలి. పెద్ద కిటికీలకు, ప్రత్యేక గాజుతలుపులు అమర్చాలి. జాగ్రత్తగా పనిచేయించు." అని చెప్పడం రత్తి విన్నది.

సందె చీకట్లు ప్రకృతిని ఆవరించాయి. రేషన్ డిపోనుంచీ, తెచ్చిన బియ్యాన్ని బాగుచేసి, రత్తి ఎసర్లోపోసింది. పోలిగాడు దగ్గర్లోనే కూర్చొని చిదుగులు, పొయ్యిలో పెడుతున్నాడు.

"పోలిగా! పెద్దదొర యియ్యాల సెబుతూంటే యిన్నాను. ఆ తూరుపేపు పెద్దగది ఆడోళ్లు పురుడోసుకోటానికంట. పింగాణీ బిళ్లలు అతుకుతారంట. తలుపుల కద్దాలు పెడతారంట. మల్లీ పురుడొత్తే ఆచుపత్రిలో పోసుకుంటా. మన గుడిసెలోపసైన మంచం కుక్కి గూడ లేదు. తడెవ, తడెవ సాల యాతనగా ఉంది."

"రత్తీ! పురుడుమోజు నీకింకా తీర్నె దంల్నే. మనబోటోళ్లు పిల్లల్ని కని ఏం లాభం. మనలాగ రెక్కలిరగ్గొట్టుకు అవత్త పడితేనే, అన్నం దొరకటం అంతంత మాత్రం కట్టంమంది. శమట తీసేది మనం, మన బిడ్డలు. సుకం, అనుభవం దొరలది..."

"నిజవేరా! పెతిదీ దర పెరిగిపోయింది. పెద్దదొరకి యీ కంట్రక్టులో సాలా మిగులు తాదంటగా... కొత్త కూలెక్కు విప్పిత్తే కడుపునిండా కూడు తింటాంగాం..."

"మన కెందుకిత్తారే, పిచ్చి మొగవా!.. ఆళ్లు ఏలు సంపాయించుకోవద్దూ! యిందులు సెయ్యటానికీ, బొమ్మలెయ్యటానికీ కర్సు పెడతారు గాని, కూలెక్కు విత్తారా...మనం తింటే ఆళ్లకేం? తినక పోతే ఆళ్లకేం..."

ఇంతలో అన్నం ఉడుకు పట్టడం చూచి రత్తి గంజి వొంచే చిప్పకోసరం అవతలకు వెల్లింది. పోలిగాడు గుడిసెకు దగ్గర్లోనే ఆడుకొంటున్న పిల్లల దగ్గరకేసి వెళ్లాడు.

ఆ రోజురాత్రి చాలా ప్రొద్దుపోయిందాక, పోలిగాడు, రత్తీగడవని దుర్దినాలల్లో నిలవని ప్రాణాలను, నిలుపుకోవడానికి పడే సంఘర్షణతో, తమ వ్యధా జీవిత కథనంలోని, చీకటి వెలుగుల్ని తరచి చూచుకొని నిస్పృహతో అలిసి నిద్రాదేవి వొడిలో వొరిగి పొయ్యాడు.

* * *

వైద్యాలయ భవన నిర్మాణం పూర్తి అయ్యింది. ఆరోగ్యశాఖామాత్యుల చే ప్రారంభోత్సవం జరిగింది. కంట్రాక్టరు అచ్చయ్య విందు చేశాడు. జీపు అమ్మేసి కొత్తకారు కొన్నాడు. అచ్చయ్యసంసారం ఉచ్ఛస్థితికి పోతున్నకొద్దీ, పోలిగాడి సంసారం బాగా హీన స్థితికి దిగజారి పోతోంది. పోలిగాడు రోజు గడవటం కష్టంగా వున్న తన బ్రతుకునుబట్టీ, కూలివాడైపుట్టి, రెక్కలు విరగ్గొట్టుకుంటూ రాత్రింబవళ్లు దొరలకు తలొగ్గి చాకిరీచేస్తూ కూడ పొందుతున్న హింసను బట్టీ తనకు యిహ పిల్లలు వొద్దనుకున్నాడు. కానీ ప్రకృతి తన పని తాను నిర్వర్తించుకు పోతోంది. రత్తికి మళ్లీ గర్భం వచ్చింది. గర్భంవచ్చిన దగ్గర్నుంచీ తన ఊహలు నెరవేరే కాలమాసన్నమవుతుందని కలలుగన నారంభించింది. "తనకు నొప్పులు రావడం భర్త ఆసుపత్రిలో చేర్చడం ఆయాలు, నర్సులూ ఆప్యాయంగా తీసుకుపోయి, కాన్పులగదిలో బల్లమీద పడుకోపెట్టడం చుట్టూ అందమైన పింగాణీ బిళ్లలూ, అద్దాల తలుపుల కిటికీలు పైన గాలి విసిరే పంకా, అడుగులకు మడుగులొత్తుతూ ఉండే ఆసుపత్రినర్సులూ, అబ్బా! పుట్టబోయేవాడు ఎంతో అదృష్టవంతుడు... వాడి వైభోగం ముందే తెలుస్తోంది..." ఇవీ రత్తి మెదడులో మెదులుతుండే దృశ్యాలు ఆలోచనలు.

రత్తికి పురుడువచ్చే రోజులు దగ్గరపడ సాగినై. పోలిగాడు ఇంటి చాకిరీతో, కూలిపనితో, మనిషిబాగా నలిగిపొయ్యాడు. ముందు ప్రహరీగోడ పూర్తికాలేదని అచ్చయ్య మండి పడుతున్నాడు. గుమస్తా కూలివాళ్ల చేత, మధ్యాహ్నపు విశ్రాంతి కూడ ఇవ్వకుండా మండు టెండలో చెమటోడిపిస్తున్నాడు.

పగలల్లా ప్రహరీ గోడుల కందకాలల్లో చెమటోడుస్తూ, దిమ్మిసె వేసి రాత్రిళ్లు గుడిసె చేరిందగ్గర్నుంచీ, దగ్గూ, ఆయాసంతో పోలిగాడు బాధ పడేవాడు. రత్తి యిది చూచి, భర్తని ఆసుపత్రికి వెళ్లి మందు తెచ్చుకు త్రాగమని పోరుకులాడేది. మందు కోసరం ప్రొద్దున ఏడు గంటలకు పోతే పదకొండింటిదాక మందు పోసే వాళ్లు లేరు. పనిలోకి వేళకు వెళ్లకుపోతే పెద్దదొరగారి గుమాస్తా ఊరుకోడు. నాలుగు రోజులు మందుపోసిందగ్గర్నుంచీ కాంపౌండర్ "మామూలు" కోసరం చెయ్యిచాచ మొదలు పెట్టాడు. పేరుకి ధర్మాసుపత్రి. మామూళ్లూ, ముడుపులూ మాత్రం తప్పవ్. ఈ బాధలన్నీ పడలేక పోలిగాడు, ఒక రోజు ఏలునుబట్టి మందు తెచ్చుకొని,... తెచ్చుకోక బాధతోనే రోజులు వెళ్లదీస్తున్నాడు.

సంధ్య వేళప్పుడు, ప్రారంభమైన నొప్పులు రాత్రి పదిగంటలయ్యేసరి కల్లా తీవ్రమై, రత్తిని బాధించసాగాయి. రత్తి బాధ భరించలేక అప్పుడే ఆసుపత్రికి చేర్చమని పోలిగాణ్ణి కోరింది. పోలిగాడు భార్య ప్రసవవేదన చూచి "మరీ చాకిరీతో మనిషి ఈ దఫా నీరసించి పోయింది. రక్తంలేదు. క్రిందటిమాటు సులువుగా కాన్పు అయ్యింది. ఈసారి ఎలా వొడ్డెక్కుద్దో!..." అనుకుంటూనే, పెద్దకొడుకు సాయంతో, భార్యని ఆసుపత్రివరండాలోకి చేర్చాడు. చిన్నవాడు, చంకన పెట్టుకొచ్చిన చినుగుల

ప్రెసిడెంట్ వనస్పతితలనూనె
ప్రెసిడెంట్ స్నో
ప్రెసిడెంట్ టాల్కం పౌడర్
సుందర నారీమణుల ఎన్నిక




తయారుచేసినది:
రతోశ్ ట్రేడింగ్ కంపెనీ,
మద్రాసు.

బొంత పరిచాడు. రత్తిని పడుకోబెట్టి, నర్సు ఉండేగదిదగ్గరకు వెళ్లి పోలిగాడు, ఆమెను లేపి, సంగతి చెప్పాడు. అమ్మగారిదగ్గర్నుంచీ చీటీ లేందే, తానేమీ, చెయ్యలేనంది. పోలిగాడు, రొజుకుంటూ, డాక్టరమ్మ నివాసంకు, వెళ్లి తలుపుతట్టాడు. పెరట్లో కుక్క భౌ... భౌ మంది. బయట నిద్రిస్తున్న నౌకరు కుక్క అరుపుకే లేచాడో, పోలిగాడిమొర వినే లేచాడో చెప్పలేం గాని, మొత్తంమీద లేచి, విసుక్కుంటూ వెళ్లి గేటుతలుపు దీసి "ఎవరు?" అన్నాడు.

"బాబూ! ఆసుపత్రి కట్టేకాడ పనిజేత్తున్న కూలోణ్ణి. మా ఆడోళ్లకి పురుడొచ్చే రోజులు. సాలా బాదపడతంది. అమ్మగారి దరిసెనం సేయింమ సెప్పుకుంటాను."

"అర్ధరాత్రి వేళప్పుడా?... లాభం లేదు. ప్రొద్దున్నే రా! చూద్దాం."

"బాబూ! నీపాదాలకి మొక్కుతా! కూటికి లేనోణ్ణి. అది బతికితే నే, సన్నీళ్లకి, ఏనీళ్లు తోడు... లేకపోతే, నా సంసారం నట్టేటిపాలవుతాది." ఇంతలో నౌకరు బీడీ కని నిప్పుపెట్టె గీశాడు. ఆ వెలుగులో పోలిగాడి ముఖం నౌకరుకు స్పష్టంగా కనిపించింది. వాడి, ఎండిపోయిన, పోలిగాడి శరీరం, కన్నీళ్లు చూచేటప్పటికి నౌకరు హృదయం కరిగింది. కూలివాడు వారానికి కలిపి బట్వాడా తీసుకుంటుంటే, తను ముప్ఫై రోజులకూ, కలిపి జీతమనే పేరుతో తీసుకుంటున్నాడు డబ్బు. ఇద్దరికీ రెక్కాడితే నే, డొక్కాడేది. ఈ పోలికతో నౌకరుకు, పోలిగాడిపై సానుభూతి, దయ ఏర్పడి "లాభంలేదనుకుంటాను. అయినా ఉండు... వెళ్లి లేపి అమ్మగారితో చెబుతాను. ఏమంటారో..." అని నౌకరు గబ, గబా మెట్లెక్కి వరండాదాటి, ద్వారం దగ్గర కెళ్లి, "కాలింగ్ బెల్ స్విచ్" నొక్కాడు.

గంట మోతకు డాక్టరమ్మకు నిద్రాభంగం కలిగి, తీవ్రంగా కోపంవచ్చింది. రుస, రుస లాడుతూ, వచ్చి తలుపుదీసి, నౌకరు కేసి చూస్తూ "ఏమిట్రాగోల......"అంది.

"అమ్మగారూ! ఆసుపత్రి కట్టేకాడ పని జేసే కూలివాడి, పెళ్లామట. నొప్పులతో బాధపడుతూ ఉందట. కాన్పుకేసు. వాడొచ్చాడు."

"కూలివాడా.... గీలివాడ... ఛో... పొమ్మను. వెధవల కేం పనిలేదు. వేళాలేదు, పాళాలేదు. అర్ధరాత్రి వేళ కొంపమీద కొస్తారు. వాళ్ల తాతగాడి సొమ్మంతా యిచ్చి, పోషిస్తున్నట్లు. అసలు నీకు బుద్ధి లేదు. గేటెందుకు తీశావ్? రాస్కెల్...."

అని గభాల్న తలుపేసుకొని, డాక్టరమ్మ లైటార్పేసి లోపలికి వెళ్లిపోయింది.

నౌకరొచ్చి పోలిగాడిమీద విసుక్కొని గేటేసుకున్నాడు.

రత్తి బాధతో మూలుగుతూఉంది. పోలిగాడు చేసేదేమీ లేక, నిస్పృహతో కూర్చున్నాడు. ఒక రాత్రివేళ, కారుహారన్ వినబడింది పోలిగాడి చెవులకు. అదిరిపడి కళ్లు తెరిచి, చూశాడు. కారు దగ్గరికి నర్సులూ, ఆయాలూ పరుగెత్తుకువెళ్లారు. కాన్పుకోరకు, వచ్చిన కంట్రాక్టరు అచ్చయ్యదొరభార్యను, కారులోనుంచి, నర్సులు ఊతంగా పట్టుకొని తీసుకురావడం పోలిగాడికంట బడింది. మరో పది నిమిషాల్లో కారులో డాక్టరమ్మ రావడం, పెద్దదొర అచ్చయ్యగారి భార్యకు కాన్పు జేయడం జరిగింది.

జీవితంలోని హెచ్చు, తరుగుల వ్యత్యాసాన్ని గమనించేటప్పటికి పోలిగాడి హృదయం, కోపంతో, ప్రతీకారంతో నిండిపోయింది. పండ్లు కొరికాడు. పెదవి విరిచాడు... అంతకన్నా వాడు చెయ్యగలిగిం దేముంది?...

అభిమానం, రోషం మరో నిముషంలోనే చంపుకొని, వెళ్లి డాక్టరమ్మని తన భార్యనుకూడ చూడవలసిందిగా ప్రాధేయపడ్డాడు.

ఆమె "ఇప్పుడెక్కడ... వేళాపాళా లేదా? ప్రొద్దున్నే చూస్తాను." అంటూ నర్సుని పిలిచి ఏదో గొణిగి, తాను కార్లో ఎక్కి ఇంటికి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన కాసేపటికి నర్సు ఏవో రంగునీళ్లు తెచ్చి రత్తిని నోరు తెరవమని, పోసిపోయింది. తెల్లవారు ఝామును రత్తికి పొట్ట ఉబ్బింది. బాధ ఎక్కువైంది. క్రమంగా గురక పెట్టడం మొదలుపెట్టింది.

పోలిగాడి హృదయంలోని ఆశాజ్యోతి సన్నగిలింది. అంధకారం ఆవరిస్తోంది. బాధలోనే రత్తి, భర్తను దగ్గరికి పిలిచి, పిల్లల్ని అప్పజెప్పి, ఏడుస్తున్న భర్తకళ్లను, పైటచెంగుతో తుడిచి "ఎందుకు బాధపడతావ్... బిడ్డల్ని కూసుకో... మన కడుపులు మాడుసుకుని, సెమట, రకతం తీసేసి, యీ ఆసుపత్తిరికి శాకిరిసేసి కట్టాం. దరమాసుపత్తిరి అన్నా, దనంగలోళ్లకే గాని, మనకొక్కడురా! అబ్బ! మానమీన జాలి గలవాల్సిన పని, పెపంచకాని కెందుకుంటదిరా? కట్టం మనది. పేరు వుంకొకరిది. అనుభవం మారాజులిది... స్వతంత్రంకూడ ఆళ్లకే... మాటలు యిని యిహమీన మోసపోవాక...... అంతా చవానం వొర్తి అబద్ధకం...ఈ రాసికం మనసులో పెట్టుకో!!

అంది.

భార్యమాటలు వింటుంటే, "లేనివాళ్లు, వాళ్ల జీవితాలకి, వాళ్లే సమాధిగోతులు త్రవ్వకొని, లోపల కూర్చొని, వాళ్ల చేతులతోనే మట్టిని లాక్కొని, పూడ్చుకోవాలి." అన్నట్లు పోలిగాడి హృదయానికి తట్టింది.

తెల తెలవారుతూ ఉండగా స్వతంత్రోత్సవ ప్రభాత భేరి మ్రోగింది. దొంగమార్కెట్టువ్యాపారంతో ధనరాసులు ప్రోగుజేసిన కుబేరులంతా తమ దాతృత్వం ప్రపంచానికి, చాటటానికి, ఊరేగింపులు ఉత్సవాలు విందులు, చేస్తున్నారు.

పోలిగాడికి యీ సంరంభం అర్థంగాక, ఏమిటని ఆసుపత్రి నౌఖర్ని అడిగాడు నాలుగడుగులు అవతలకేసి.

"ఇవ్వాళ, స్వాతంత్ర్యదినం. ఆగష్టు 15." అన్నాడు నౌఖరు.

ఇంతలోనే "ఒరే! అయ్యోయ్!... అమ్మ... అమ్మ..." అని బావురుమన్నాడు పెద్దాడు.

పోలిగాడు భార్య దగ్గరకువచ్చేటప్పటికి, రత్తి ఆఖరి ఊపిరి తీసి వొదిలింది. పోలిగాడు, బిడ్డలతోసహా భార్యశవంపైబడి హృదయం బ్రద్దలు కొట్టుకుంటున్నాడు.

బ్యాండు, సన్నాయి మేళాలతో, స్వతంత్రదినోత్సవపు ఊరేగింపు వైభవంగా, ఆసుపత్రిముందుగా సాగిపోతోంది జయ, జయ, ధ్వనులతో.......

★



సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్‌సరన్, 54 బందరు వీధి. మద్రాస్. బెజవాడ డిపో: సూర్యారావుపేట.